
# కలిమి బెట్టు-నీతి

కె. రామలక్ష్మి



"మీకు టెలిగ్రాం వచ్చింది. పుచ్చుకున్నాను. ఇదిగో..." అంటూ పక్కింటి పద్మ నాకు అందించింది.

"ఎవరై వుంటారబ్బా!" అంటూ కళ్లజోడులో పడుతున్న జుట్టు వెనక్కి తోసే ప్రయత్నం చేస్తూ టెలిగ్రాం విప్పాను.

"మీ అమ్మగారా!" కుతూహలంగా అడిగింది పద్మ.

"ఇంకెవరు పంపుతారు నాకు! అరె, అమ్మ చాలా సీరియస్‌గా వుందిట. తనే!" అన్నా పద్మ ముఖంలోకి చూస్తూ.

పద్మ ముఖం చిన్నబోవడం స్పష్టంగా కనిపించింది.

"అరె, ఏదో లాటరీలో కోటి! ప్రైజ్ మనీ వచ్చిందనుకున్నావా పద్మా!" నవ్వేశాను.

"మీరు ఏదీ సీరియస్‌గా తీసుకోరు" నవ్వడానికి ప్రయత్నించింది పద్మ.

ఆమె ముఖంలోకి క్షణంపాటు సీరియస్‌గా చూశాను. పద్మ నాకంటే రెండు మూడేళ్లు చిన్నదే. కానీ బాగా నలిగిపోయింది మనిషి. పెళ్లయిన ఐదేళ్లలో ముగ్గురు పిల్లలు. భర్త ఉద్యోగం- హాయిగా మూడు పూళ్లూ ఆరు క్యాంపులుగా జరిగిపోతోంది. ఎప్పుడైనా "నేనూ వస్తానండీ" అని వుంటుందో లేదో అన్న అనుమానం నాకు!

"వెడతారా!" కుతూహలంగా అడిగింది పద్మ.

"వెళ్లకపోతే ఎలా పద్మా! అమ్మ కదా!" అన్నాను.

"నిజమేనండీ! ఆడపిల్లలే తల్లి కోసం బాధపడేది. అబ్బాయిలు పట్టించుకోరు. ఏదో చెప్పి, ఇబ్బందిపెట్టే విషయాలని తప్పించుకు తిరుగుతారు. మా అన్నయ్య లంతే. మావారూ అంతే. తల్లి మాట నమ్మరు" సన్నగా నవ్వింది పద్మ.

"బాగా అనుభవం అనుకుంటాను" నవ్వుతూ పద్మ భుజం తట్టాను.

పద్మ మంచి పిల్లే. కానీ ఆమె పిరికితనానికి హద్దు ల్లేవనిపిస్తుంది నాకు.

"రా... బజారు కెడదాం" అంటే దరిదావు వణికిపోతుంది.

"మీ ఆయనేం తినేస్తాడా ఏమిటి?" అని నవ్వితే,

"కాదు. ఏమీ అనరు గానీ" నీళ్లు నములుతుంది పిచ్చిది.

మగవాడు- మాట పైకి అనాలా ఏమిటి? ఒక్క చూపు చాలదా!

"పద్మా! నువ్వు పిరికిదానివి. అది చూసి నీ మీదినుంచి నడిచేస్తున్నాడు- నీ మొగుడు! రేపు నీ పిల్లలు పెద్దయ్యాక- వాళ్లూ నీ మీదినుంచి నడిచేస్తారు. వారి వారి గమ్యాలు చేరుకుంటారు హాయిగా- నువ్వి లాగే..."నవ్వాను.

"నీ ధైర్యం నాకెలా వస్తుంది. నువ్వు సంపాదిస్తున్నావు. నీకు బాధ్యతలు లేవు. వచ్చాక చూడాలి ఎలా మారుతావో!" కాస్త నవ్వింది పద్మ.

"బహుశా ఈ జబ్బు వంక అందుకేనంటావా!" కాస్త ఆలోచనలో పడుతూ అన్నాను. నాలో కాస్త సంశయం తలెత్తిన మాట నిజం. ఎలాగైనా నా పెళ్లి చేసేస్తే, తాను హాయిగా చచ్చిపోవచ్చుననుకుంటుంది అమ్మ.

"నా పెళ్లి నీ చావుకొస్తే నేనెందుకొప్పుకోవాలి" అంటాన్నేను.

"ఇదో ఆట అయిపోయింది మా ఇంట్లో. అన్నలు, వదినెలు, పిల్లలు... అబ్బబ్బ! అందరికీ నన్ను చూస్తే జెలసీ ఏమో అనిపిస్తుంది". అదే పద్మతో అన్నాను.

"ఛ! అలా అనుకోకూడదు. ఇలా మీపై ఒత్తిడి తెస్తున్నారని ఆనందపడి పోకండి. కొన్నాళ్లు పోతే పట్టించుకోరు" అంది ధీమాగా పద్మ.

"ఏం? ఎందుకలా అనుకుంటున్నావు?" కుతూ హలంగా అడిగాను.

"మా అక్క మంచి ఉద్యోగంలో చేరాక, నాన్న దానికి సంబంధాలు చూస్తున్నట్టు నటించారే గానీ- నాకు నిశ్చయించే ప్రయత్నం చేశారు. ఎందుకో తెలుసా?"

"ఒద్దందేమో!" అనుమానంగా అన్నాను.

"ఏం లేదు. 'దాని బతుకు అది బ్రతక్కలదే వెర్రిముఖమా! పద్మకి చేసేస్తే మనకీ సుఖం' అని నాన్న అమ్మతో అనడం చాలాసార్లు విన్నాను" నా ముఖంలోకి చూస్తూ ఆగింది పద్మ.

నేనేం మాట్లాడక పోవడం చూసి పద్మ కాస్త సంశయిస్తూ, "నమ్మలేకపోతున్నారా?" అడిగింది.

అప్పటికీ నేను సమాధానం చెప్పలేకపోయాను.

"అలాగే అన్పిస్తుంది. నమ్మబుద్ధి కాదు. కన్నవారికి అలాంటి స్వార్థం వుంటుందంటే- నమ్మకం కలగదు" నిట్టూరుస్తూ అంది పద్మ.

"ఛ!ఛ! అలా అని కాదు పద్మా! ఇంత చిన్న వయసులో ఎన్నెన్ని నగ్నసత్యాలు తెలుసుకున్నావు- అని మూగపోయానంతే!" అంటూ పద్మ ముఖం నావైపు తిప్పుకున్నా.

ఆమె కళ్లు వర్షించడానికి సిద్ధంగా వున్న మేఘపు తునకలుగా వున్నాయి.

"అవునండీ! ఇప్పుడు అన్నయ్యలు సుఖంగా వున్నారు. నేనూ సుఖంగా వున్నట్టే! కానీ అక్కయ్య? ఎవరికి అవసరమైతే వారిని ఆదుకునే కలిమిచెట్టు. ఎవరికి సాయం కావాలంటే అక్కడ చాకిరికి ఆత్మబంధువు. ఆమె ఎవరిదీ కాదు, కానీ అందరిదీనూ. ఇలాంటి జీవితం కోరుకోకండక్కా! దారుణంగా వుంటుంది. ముందు వెళ్లండి. అమ్మని చూసి రండి. అదే నేను కోరేది" అంటూ లోపలికి ఒక్క పరుగున చక్కా పోయింది పద్మ.

నేను ఆలోచనలో పడ్డాను. అన్నయ్య, మామయ్య ఏదో ఒక తలమాసిన సంబంధం తెచ్చి, "ఒప్పిస్తావా! ఛస్తావా!" అని పీకల మీద కూర్చుని వుంటారు. నేను వెళ్లడమే మంచిదని నిర్ణయించుకున్నాను. పద్మ ఇంట్లోకి నడిచాను.

"పద్మా! నేనీ రాత్రికే బయలుదేరి వెడతాను. నేను తాళాలిచ్చి వెడతా. కాస్త ఇల్లు చూసుకో..." అని ఆమె భుజంమీద చేయివేసి నొక్కాను.

ఆమె ముఖం పువ్వులాగ విడింది.

"సంతోషం అక్కా! అమ్మ వున్నప్పుడే- పుట్టిల్లు వుండేది. ఆమె కాస్త కనుమరుగైతే- అది నీకు అమ్మగారిల్లు కాదు- అన్నల ఇల్లు, నాన్న ఇల్లు... అంతే!" అంటూనే కాఫీ చేసి అందించింది నాకు.

కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూ పద్మ ముఖం పరిశీలనగా చూశాను.

"యౌవ్వనపు జాడ వుంది కానీ మెరుపేమైంది" అనుకున్నా.

"సరి- బయలుదేరే ముందు తాళాలిస్తాను. నే వచ్చేలోగా పిల్లల్ని హింస పెట్టకు" నవ్వుతూ లేచాను.

"వాళ్లు మటుకు నువ్వు రాగానే చెప్తామని బెదిరిస్తారు. నువ్వు నన్ను జైల్లో పెట్టిస్తావని వాళ్ల నమ్మకం" నవ్వుతూ సాగనంపింది పద్మ.

★★★

ఇంట్లోకి అడుగుపెడుతుంటే కాస్త భయం అనిపించింది. ఎప్పుడూ వుండే సందడి కూడా లేదు. అన్నయ్యలు రానట్టుంది. కనీసం ఆదదిక్కుగా ఒక వదిన వచ్చి వుండదా అనిపించి, హాల్లోకి అడుగుపెడుతూ "అమ్మా!" అని గట్టిగా పిలిచాను.

"అమ్మాయి గారూ, మీరా" అంటూ రత్నమ్మ కొంగున చేతులు తుడుచుకుంటూ పరుగులాంటి నడకతో హాల్లోకి వచ్చి చేతిలో వున్న చిన్న పెట్టె అందుకుంది.

"అమ్మకెలా వుంది? టెలిగ్రామ్ చూసి భయం వేసింది. డాక్టరేమన్నారు?" ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపిస్తున్న నన్ను చూసి-

"అమ్మాయిగారూ! అమ్మగారి ఆరోగ్యం బాగో లేదమ్మా. అయితే అన్నయ్య గార్లని రమ్మని టెలిగ్రాములు పంపలేదు. మిమ్మల్ని చూడాలని తహతహ లాడు తున్నారు. అందుకే..." దాని మాట పూర్తి కాకుండానే జోళ్లు హాల్లో మూలకి విప్పి, అమ్మ గదిలోకి వెళ్లాను- ఆత్రంగా.

గదిలో అడుగు పెట్టగానే నా మనస్సు ఏదో తెలియని బాధతో మూల్గింది. పిల్లలుండి, భర్త పోయిన నిస్సహాయురాలైన ఓ ఆడది- ఒకటేమిటి... ఎందరో ఆడవాళ్లు నా కళ్లముందు కదలాడారు. నా కళ్లు నీటిపొర కమ్మి అమ్మ కూడా అలికేసినట్టు అయింది.

"అమ్మా!" అంటూ ఆమె మంచం చేరి, చిక్కిన ఆ చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. చక్కగా మేనిక్యూర్ చేసి వెండి రంగు వేసిన నా చేతిగోళ్లు, నరాలు తెలుస్తూ, చిన్నమెత్తు కండ కూడా కనిపించని అమ్మ చేతిలో చాలా వికృతంగా వున్నాయనిపించింది.

తీసేసుకోపోతూంటే, అమ్మ గట్టిగా పట్టుకుంది.

"వచ్చావా!" ఆప్యాయంగా నా చేయి నొక్కింది.

ఆమె కళ్లు గుంటలు పడి చిన్నవైనట్టు అన్పించింది నాకు.

"ఏమైందమ్మా? డాక్టర్ని చూశావా! పోనీ వెడదామా?" ఆమె జుట్టు ముఖం మీదినుంచి చెవి వెనక్కి తోస్తూ అడిగాను.

అమ్మ ఇంత వడలిపోయి నేనెప్పుడూ చూడలేదు. అసలామె ఇష్టాయిష్టాలు కూడా నాకు తెలియవు. అసలు ఇంట్లో ఎవరికైనా తెలుసా? అని ఇప్పుడు వస్తుంది- అనుమానం.

"వచ్చావా... నువ్వు రావేమోనని చాలా భయం వేసింది చిట్టితల్లీ! రాకపోతే, నేను చచ్చిపోకుండా ఇలాగే ఆగివుండేదాన్ని!" నవ్వడానికి ప్రయత్నించిన ఆమెకి- దగ్గుతెర వచ్చింది.

రత్నమ్మ ఒక కప్పు కాఫీతో గదిలోకి వచ్చింది.

అది నాకందిస్తూ- "అమ్మాయి గారూ! మీరైనా చెప్పండి. అన్నయ్య గార్లని పిలిపించమని. నాకు భయంగా వుందమ్మా! నా మొగుడూ అదే అంటూంటాడు. ఏదైనా అయితే, మననంతా ఆడిపోసుకుంటారే! అమ్మగారికి చెప్పి బాబులని పిలిపించమను... అంటూండమ్మా!" చెప్తూనే అమ్మని లేవదీసి వెనక తలగడ వేసి కూర్చోపెట్టింది

గ్లాసులో వెచ్చని నీళ్లు తీసుకొచ్చి నోటికి అందించింది. అమ్మ రెండు గుక్కలు తాగి, చాలని గ్లాసు తోసేసింది.

"రత్నం భయం నీ అన్నలు దాన్ని తిట్టిపోస్తారని చిట్టీ... అన్నీ దోచుకుంది అంటారని... ఎవరి పిచ్చి వాళ్లది... వాళ్లకి తెలియదా... నాదంతా వాళ్లదేనని! వాళ్లకి దక్కకుండా పోతే పూరుకుంటారా దీని పిచ్చిగాని! ఇప్పుడు వాళ్లకి మరీ హాయి! చాకిరీ లేదు. సర్వం చేతికొస్తుంది" పేలవంగా నవ్వుతున్న తల్లిని వారిస్తూ-

"నీకేమైంది, ఇలా మాట్లాడుతున్నావేమిటమ్మా... ఎప్పుడూలాగా పెళ్లో పెళ్లో... అంటావన్న భయంతో- అస్సలు రాకూడదనుకున్నాను" నవ్వుతూనే అన్నాను.

అమ్మ కూడా నవ్వేస్తూ- "మీ అన్నలన్నట్టు దానికేం తొందర! నెలకి పాతిక వేలకి పైగా జీతం. దాన్నెవడైనా తన్నుకుపోతాడు!" కూతురి చేయి తన చేతిలోకి తీసుకుంటూ... "నీకు నీతి బోధ చేయాలనిపించింది ఈ చివరి రోజుల్లో. ఎందుకో తెలుసా? నువ్వూ నాలాగే అయిపోతావని చిట్టీ... నీతో చాలా సంగతులు మాట్లాడాలి... చాలా చాలా మాట్లాడాలి... వినే ఓపిక వుందా! ఏమిటీ ముసలి గోల అనుకుంటావా!"

"అదేం మాటమ్మా... నీది ముసలి గోల ఎందుకవు

తుంది. నీ జుట్టు ఉట్టినే తెల్లబడిందా... అంతర్మథనంలో కాదూ! నీ కళ్ల చుట్టూ కాకికళ్లు ఎన్ని నవ్వుల, ఎన్ని వేదనల ఫలితమో వూహించలేనా! ఉండు... బట్టలు మార్చుకుని వస్తాను. కబుర్లు చెప్పుకుందాం."

"రత్నమ్మా! నాకీవేళ పెసరకట్టు పూర మిరపకాయలు కావాలి సుమీ!" అంటూ గదిలోకి వెళ్లి, పెట్టె తెరిచి ఓ నైట్ గౌను తీశాను కాస్త విశ్రాంతిగా అమ్మ దగ్గిర కూర్చోవాలని.

★★★

అమ్మకి బాగా జబ్బుగా వుందని తెలుస్తూనే వుంది నాకు. కానీ ఆమె మాటలు వింటే గానీ, ఆమె నా మాట విని ఆస్పత్రికి వచ్చేలాగా తోచలేదు.

"ఏమ్మా!" అంటూ దగ్గిరగా కూర్చోబోతున్న నన్ను ఆపి-

"చిట్టీ... ఆ బీరువా తెరు. దాన్లో ఓ ఎఱ్ఱచీర వుంది చూడు" అంది.

నేను బీరువా తెరిచాను. ఎఱ్ఱచీర చూడడానికి నలిగిన ముద్ద మందారంలా వుంది. బాగా నలిగిపోయి- రంగు వెలసిన చీరల మధ్య అది- గువ్వలాగా ఒదిగి వుంది.

"కట్టుకుందో లేదో" అనిపించింది కూడా.

"చూడు చిట్టీ, నా జీవితం అంతా... ఆ చుట్టూ నలిగిపోయి వెలిసిపోయిన చీరలతో గడిపేశాను" అంది. అమ్మని చూస్తే భయం వేస్తోంది.

"అమ్మ పోతే?" ఎంత వద్దనుకున్నా అదే ఊహ బుఱ్ఱని తొలిచేస్తోంది.

"ఎంత బాగుందమ్మా ఎఱ్ఱచీర! నువ్వు కట్టుకోగా నేనెప్పుడూ చూడలేదే!" అన్నాను.

"కట్టుకోలేదు చిట్టీ... ఇలా వచ్చి కూర్చో చిట్టీ... నే పోయేలోగా నీకు కొన్ని పాఠాలు చెప్పాలి. నేర్చుకున్న పాఠాలూ, నేర్పించిన నీతులూ తుడిచివేయమని నీకు చెప్పాలి చిట్టీ... నేను బాగా వున్నప్పుడు నువ్వు ఎదిగేటప్పుడు.. నీకు మంచి పాఠాలు నేర్పాను. కానీ తప్పుగా నేర్పాను. అవి మరచిపోవాలి నువ్వు."

"అదేం మాటలమ్మా! నువ్వో మంచి భార్యవి. మంచి తల్లివి. దీన్ని ఎవరూ కాదనలేరు" ఆమె చెయ్యి గట్టిగా నొక్కుతూ అన్నాను.

"తనని మించి ఇతరులకి అన్నీ సమకూర్చేదే గదమ్మా తల్లి" అన్నాను.

"ఎవరికీ ఎప్పుడూ ఏ లోటూ రానివ్వలేదే- నాకు తెలిసినంత వరకు. నిన్ను, నీ అవసరాలనీ కూడా మరిచిపోయి చేశావు కదమ్మా! నీది త్యాగం, మాది స్వార్థం" అన్నాను.

"నీ అవసరాల గురించి నువ్వు ఆలోచించుకునే రోజు- ఎప్పుడో రావచ్చునేమో అనుకోకు చిట్టీ... కానీ అవి రానే రావు. నా జీవితం అందుకో నిదర్శనం కదా. మీ నాన్నకి చేసి, నీ అన్నలకి చేసి, నీకు చేసి..." అమ్మ తల అడ్డంగా వూపుతూ ఆగింది.

ఇంత వుందా అమ్మ మనసులో అనిపించింది.

"నువ్వంతా చేశావమ్మా. ఓ తల్లి చేయవలసినదంతా చేశావు. ఇప్పుడెందుకీ ఆలోచన..."

"ఊహూఁ చిట్టీ! అదేం లేదు తల్లీ. అది ఎవరికీ లాభం లేదు. నేను చేసిన పెద్ద తప్పేమిటో తెలుసా? నాకు నేనేం అడక్కపోవడం. నన్ను గురించి నేను ఆలోచించకపోవడం... చిట్టీ! మీ నాన్న ఏమనేవాడు- ఒంట్లో బాగులేక పడుకుంటే- 'ఏయ్... అలా జబ్బుపడితే ఎలా! ఈ కొంపెలా గడుస్తుంది? నా పనేంగానూ!' అని ఆరాటపడిపోయాడే గానీ..." అమ్మ ముఖంమీద ఓ పేలవమైన చిరునవ్వు వెలిగింది.

"నే పడుకుంటే తిండెవరు పెడతారన్న బెంగేగానీ నేనేమైపోతానని భయపడలేదు. అదృష్టవంతుడు... సేవలు చేయించుకుంటూ పోయాడు. పిల్లలు మటుకు, అందరూ నాపై స్వారీ చేసి నన్ను నెట్టేసి వెళ్లేవాళ్లే కదా చిట్టీ! మొట్టమొదట లేచేది నేను. చిట్టచివర రాత్రి నడుము వాల్చేది నేను వారానికి ఏడు రోజులూ... అన్నీ సరిపెట్టుకోవడమే. అందరూ తిన్నాక, మిగులూ తగులూ తిన్నాను. పైకి అంటే... ఏమంటారు: నువ్వే కదా వండేది? నీకూ సరిపడేలా చూసుకోవద్దా!" కళ్లు మూసుకుంది అమ్మ.

కనురెప్పల చివర నుంచి చెవికేసి జారుతోందో కన్నీటి బొట్టు. చేత్తో తుడిచాను. నా చేయి పట్టుకుంది అమ్మ...

"మీ అన్నలు వదినలనీ చూస్తుంటే గుండెదడ వస్తుంది. సరిగ్గా వాళ్లు వాళ్ల పెళ్లాలని అలాగే చూస్తున్నారు. నాలాగే... నేనులాగే వాళ్లూ! ఆడది ఉండేదే- వారికి ఇవ్వడానికని! బహుశా... నేనే నేర్పానేమో చిట్టీ వాళ్లకి... నీకు తెలియదు, నేను అతి పిసినారిగా చేర్చిన డబ్బు- ఓ రోజు తీసుకుని బజారుకెళ్లి ఆ ఎఱ్ఱచీర కొనుక్కుని తెచ్చుకున్నాను. అది చూసి, మీ నాన్న ఓ నవ్వు నవ్వి- 'ఇదెందుకు? ఎక్కడికి కట్టుకుంటావు' అన్నాడే గానీ బాగుందనలేదు. కొట్లోంచి తెచ్చాక- ఆ చీర అలాగే- వెలిసిపోయిన నా చీరల మధ్య వుండిపోయింది. చిట్టీ! నేను చాలా పిచ్చిదాన్నే. 'ఈ జన్మలో అన్నీ అందరికీ చేస్తే.. తనకేం కోరుకోకపోతే.. అడక్కుండా అన్నీ అవే చేకూరుతాయి' అని నమ్మిన పిచ్చిదాన్ని! ఒక సత్యం గ్రహించాను ఇప్పుడు- ఇంత ఆలస్యంగా. నిజంగా దేవుడు మనని అన్నీ... అనుకున్నప్పుడు పొందమని వరం ఇచ్చే వుంటాడు. కానీ దాన్ని మనం అర్థం చేసుకోలేదు. త్యాగంలో తనని తను మరిస్తే అందరూ మరిచిపోతారు చిట్టీ... ఏదైనా అద్భుతం జరిగి నేనింకో తల్లిగా మళ్లీ పుట్టగలిగితే- తప్పకుండా కొత్త పాఠాలు నేర్చుకుంటా. కొత్త ఒరవడి దిద్దుకుంటా. కానీ ఆ అవకాశం నాకు లేదు. చిట్టి తల్లీ! నేను నీకు మరీ మరీ చెప్పదల్చు కున్నదొక్కటేనమ్మా... నా అడుగుజాడల్లో నడవకు. నాకు మాటివ్వు" అంటూ నీరసించిపోయిన చేతిని జాపింది.

దాన్ని అంటుకుని కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాను.

"నాకు అర్థమైందమ్మా... నేను నీ మాట విన్నాను. నేను నీలాగ వుండనమ్మా... ఇదిగో మాటిస్తున్నాను. మనం పొద్దుటే ఆస్పత్రికి వెడదాం మరి."


కానీ ఆమెలో చలనం లేదు.

★★★

"నీకేమైనా చెప్పిందా!" అంటున్న అన్నయ్యలనీ, "నగల మాట చెప్పారా!" అంటున్న వదినలనీ- అమ్మ కళ్లలో చూశాను. వికృతంగా కనిపించారు.

"ఆఁ చెప్పింది. చాలా చెప్పింది..." అని మౌనంగా వెనుతిరిగాను.

## జ్ఞానకిరణం



"నిస్సహాయుల నిట్టూర్పులే
నిరాకారుడి ముందు మోకరిల్లితే
ఆత్మీయత నశించిన చోటే
అంతరాత్మగా మారితే,
జాలిలేని లోకానికి
కొండంత నమ్మకమైన మతమే
చివరికి మత్తుమందుగా మారినపుడు
పీడితుల- పదదళితుల
యుద్ధాల అనుభవసారమే
ఇపుడు దారిచూపుతున్నది!
ఆధిపత్యానికి అపరాధాలకు
ఆలవాలమిపుడు మతం,
అన్యాయాలకు- దౌర్జన్యాలకు
అండగా నిలిచిన దేవుడి
రాజకీయం,
అన్నార్తులు- అమాయకులు
ఆరతి కర్పూరంలా కరిగే బదులు
బుద్ధిని- సంఘాన్ని
శరణు కోరవలసిన చోట
నాపరాళ్లు- పాలరాతి అవతారాలు
అడ్డుపడితే-
మనిషిని కరిచే మతాల కంటే
జ్ఞానకిరణమే నిరంతర మార్గదర్శి!!

- నిఖిలేశ్వర్